"నా కల! నా కల!" అన్నాడు జోగారావు పుద్రేకంతో.

అత నేవిషయం మాట్లాడుతున్నాడో లీలకు అర్థం కాలేదు. ఆమె అతనికేసి వింతగా చూస్తూ అట్లాగే నిలబడింది... ...

# సహనం

నే నా సమయంలో బెజవాడ యెందుకు వెళ్ళానో నాకు సరిగ్గా జ్ఞాపకంలేదు. కాని, స్నేహితుడు కామరాజు నన్ను బలాత్కారంగా సినిమాకు తీసుకుపోవటమూ, "ఆ పిక్చరు బాగ లేదంటున్నారు. నేను రాను" అని నే ననటమూ, "వేరే ఒకందుకు రమ్మంటున్నాను. బాగుండని పిక్చరు చూస్తే యింతలో నువ్వేమీ పొట్టపోవులే" అని కామరాజు నన్ను దెప్పటమూ నాకు బాగా జ్ఞాపకం వుంది.

మేము వెళ్ళేసరికి హాలు చాలాభాగం ఖాళీగా వుంది. ఆ పిక్చరు వారనే నడిచింది. మేం ఆఖరురోజు కాబోలు చూశాం. బాగుండని పిక్చర్లు చూడటం నాకు చాలా బాధ. పొట్టపోనని కామరాజు అనగానే సరా? నా లోపల చాలా డామేజి జరిగింది.

"నాచేత యీ దిక్కుమాలిన పిక్చ రెందుకు చూడ సిచ్చావో దయచేసి చెబుతావా?" అని నేను కామరాజును తిరిగి వచ్చేటప్పుడు దబాయించాను.

"రెండో హీరోయిన్ వేసిన సుశీల యెట్లావుంది?" అన్నాడు కామరాజు, మళ్ళీ నాకు పిక్చరు జ్ఞాపకం తెచ్చి బాధపెడుతూ.

"నా కేమీ గొప్పగా కనిపించలేదు" అన్నాను.

"ఏం గొప్పగా కనిపించాలి? ఆ పిల్ల ఎంత అందంగా వుంటుందో తెలుసా!"

"అందంగా లేదని నే ననలేను. గొప్పగా కనిపించ లేదన్నాను. అంటే నటనలో పొడిచెయ్యలేదని నా వుద్దేశం."

"ఆఁ ఆ డైరెక్టరు వట్టి వాజ. నువు సుశీలను చూస్తే నీ అభిప్రాయం మార్చుకుంటావు" అన్నాడు కామరాజు.

"నే నిప్పుడు కనిపెట్టుకుని ఆమెను చూడటం దేనికి, నా అభిప్రాయం మార్చుకోవటం దేనికి?" అన్నాను.

"ప్రస్తుతం బెజవాలోనే వుంది. నువ్వు చూసి పని కొస్తుందంటే మన పిక్చర్‌లో బుక్ చేద్దామని!"

నేను యెవరో కొట్టినట్టు ఆగాను. "మనం" పిక్చరు తీసే ఆలోచనలో వున్నట్లు కామరాజు నాకు ముందుగా చెప్ప లేదు. అదీగాక నేను పిక్చర్లు తియ్యటం విషయంలో కామ రాజుకన్నా తక్కువ తెలిసినవాణ్ణి—వాని కటువంటి ఆలోచ నైనా తట్టింది. నా కెన్నడూ అది తట్టలేదు. మా వానివంటి వాళ్ళను గురించే బమ్మెర పోతరాజుగారు "కానని వాని నూత గొని కాననివాడు విశిష్టవస్తువుల్ కాననిభంగి" అన్న పద్యం రాశారు. ఆ మాటే అన్నాను.

"అట్లా కాదులే! అని రెండు ముక్కలతో నన్నూ, పోతరాజుగారినీ కూడా తీసేశాడు.

అవతలివాడు మన దగ్గరలేని డబ్బు వుందనిగాని, రాని విద్య వచ్చునని గాని అపోహపడితే కలగని ఆనందం, మనకు సిసీయాలను గురించి తెలుసు ననుకుంటే కలుగుతుంది. నేను కూడా అటువంటి ఆనందమే పొందినవాణ్ణయి మర్నాడు యీ సుశీలను చూడటానికి సమ్మతించాను.

సుశీల యెక్కడో బందరు కాలవకట్టన ఒక గుహలాంటి భాగంలో వుంటున్నది. మర్నాడు యిద్దరమూ అక్కడికి వెళ్ళాం. ముందట "ఏమండీ! ఎవరండీ లోపల?" అని రెండు మూడుసార్లు కేకేశాం. కాని జవాబు లేదు. కామరాజు తలుపుమీద రెండుతట్లు తట్టినాక, "ఎవరా తలుపుతట్టేది?" అని కోపంగా ప్రశ్న వినిపించింది. కబురందిందిగదా అని తలుపుకేసి ఆశగా చూస్తూ నిలబడ్డాం. రెండు నిమిషాలు గడిచినా తలుపు తెరుచుకుంటుందన్న మా ఆశ కనిపించలేదు. కామరాజు మళ్ళీ తలుపుతట్టాడు.

"ఎవరంటే చెప్పకుండా అదేమిటి తలుపు తడతావు. వేళాకోళమా యేం?" అని మళ్ళీ లోపల్నుంచి కోపంగా వినిపించింది.

"ఒరే, కామరాజూ! అది ఆడగొంతా, మగగొంతా? నువ్వేది అన్నా అది కాదని నేను పందెం వెయ్యటానికి సిద్ధంగా వున్నాను" అన్నాను.

అసలే కామరాజుకు మండిపోతోంది. నా మాటలు వాణ్ణి మరింత కోపం తెప్పించాయి. వాడికి 'సెన్స్ ఆఫ్ హ్యూమర్' లేదు "తలుపు తెరవండీ!" అని ఒక్క పొలికేక పెట్టాడు వాడు.

"ఒకవేళ కొంపతీసి యెవరన్నా తలుపు తెరుస్తా రేమో? మనం పారిపోవటం మంచిదని నా వుద్దేశం. తిర వాత నీ యిష్టం" అన్నాను.

కాని నేను భయపడ్డట్టు జరగలేదు. ఆ తలుపు తెరు చుకోలేదు. ఆ లోపలినుంచి మాట్లాడేవ్యక్తి—తలుపుచప్పుడు తప్ప మరే చప్పుడుకూ చలించేట్టు కనబడలేదు. మేం ఆ మనిషిని కదిలించి కార్యరంగంలోకి దించాలంటే తలుపు తట్టటంతప్ప మరోదారి లేనట్టు స్పష్టమైంది. తలుపు అదే విధంగా తట్టుతూ కూచుంటే ఆ మనిషి యెప్పటికైనా వచ్చి తలుపులుతీసే అవకాశం వుంది. మేం ఆ మనిషికి కోపం మాత్రమే తెప్పించాంగాని లేచివచ్చి తలుపులు తీసేటంత శక్తి వుత్పాదన చేయలేకపోయాం. అందుకు సందేహంలేదు.

మూడోసారి తలుపుతట్టే దమ్ము కామరాజుకు లేనట్లు కనబడటంవల్ల, "పోనీ, మనం యిప్పుడు వెళ్ళి తలుపు తెరచి వుండే సమయంగా చూసి వస్తేనేం?" అన్నాను, తలుపవతల వున్నమనిషి మనస్తత్వం మావాడికీ అబ్బినట్టుంది. వాడు నా మాటలు వినిపించుకోలేదు.

మేం అట్లా ఆ మూసిన తలుపుకేసి మౌనంగాచూస్తూ యెంతసేపు నిలబడివుండేవాళ్ళమో తెలీదు. ఈ లోపల దేవు డల్లే—కనీసం మారువేషంలోవున్న దేవుడల్లే—ఒక వ్యక్తి వచ్చాడు. మారువేషంలో యీ దేవుడు నల్లగా, సన్నగా, పొడుగ్గా వున్నాడు. సిల్కులాల్చీ వేసుకున్నాడు. బీడీ కాలుస్తున్నాడు. మెడలో సన్నని బంగారుగొలుసు ధరిం చాడు. ఉంగరాలుతిరిగిన జుట్టు అతని తలకు రెండువేపులా

నే ఆధారమూ లేకుండా నాలుగేసి అంగుళాలమూగం ప్రాకారు
రూపంలో పక్కలకు వ్యాపించి నిలబడివుంది.

"ఎవరుమీరు ?" అన్నా డీ దేవుడు మామీద కచ్చ
వున్నవాడల్లే.

"మేం సుశీలను చూడటానికి వచ్చాం" అన్నాడు
కామరాజు.

"ఏం పని?" అన్నాడు ఆ మనిషి, యింకా కోపంగానే.

"మేం సినిమా తీయబోతున్నాం" అన్నాడు కామ
రాజు.

బీడీ కాల్చేమనిషి ఒక్క క్షణంపాటు కామరాజుకేసి
నమ్మలేనట్టుగా చూసి, బీడీ పక్కన సైడ్ కాలవలో పారేసి,
తలుపు దడబడా తట్టాడు. మరుక్షణంలో తలుపు తెరుచు
కున్నది. కామరాజు పిచ్చిగాని ఆ తలుపును అట్లాగే తట్టాలి.
ఆ సంగతి నేను వాడితో చెప్పి వున్నట్టయితే. "నే చెప్ప
లేదు!టా ?" అని వుండేవాణ్ణే. నాలో నే ననుకున్నా నేమో
చక్కని అవకాశం జారిపోయింది.

తలుపు తెరవిన హిడింబిలాటి ఆడమనిషి వాకిలి
కడ్డంగా నిలబడి మాకేసి కోపంగా చూసింది. (ఆ మనిషి
ఆడదని మా కామరాజు పందెంవేశాడుకాదు, నిష్కారణంగా
ఓడిపోయి వుండును.)

"ఎవరో సినిమావాళ్ళట బుల్లిని చూడొచ్చారు"
అని సిల్కులాల్చీమనిషి అయిష్టంగా వివరించాక హిడింబి
దారియిచ్చింది. మేం భయపడుతూ భయపడుతూ లోపలికి

వెళ్ళాం. ఆ యింటికి సంబంధించిన వ్యక్తుల్లాగే యిల్లుకూడా కోపంగా, సంస్కారహీనంగా వుంది.

అటువంటి వాతావరణంలో ఆ మనుషుల మధ్య చూడటంవల్ల కాబోలు నాకంటికి సుశీల మరింత అందంగా, నాజూకుగా, తెలివిగా, మంచిగా కనబడింది. ఆమెకు పద్దెనిమి దేళ్ళకంటె ఉండక పోవచ్చు ననుకున్నాను. మనిషిలో సహజ సౌందర్యం చాలా వుంది. దానికితోడు నాజూకు కూడా తెలుసు. మాట్లాడుతుంటే గొంతు మెత్తగా, మాట మర్యాదగా, వైఖరి సంస్కారం గలదిగా కనిపించింది. మా కామరాజు అన్న మాట నిజమే అయి వుండాలి. ఇంకో మంచి డైరెక్టరు చేతిలో పడితే రాణించగల మనిషి.

సుశీల దగ్గర శేనిపోని పోజులుగాని, నిక్కుగాని, బిడి యంగాని లేవు. హిడింబి ఆమె తల్లి అనీ, ఆ క్రాపువాడు ఆమె అన్న అనీ మేం తెలుసుకున్నాం. వాళ్ళ ధోరణి ఆ విధంగా వుంటే ఈ పిల్ల వాళ్ళకు యింత భిన్నంగా యెట్లా తయారు కాగలిగిందో నా కర్థం కాలేదు.

మా కామరాజుకు సినిమాచిత్రం తీయాలని ఉందనీ, అందులో తమకు వేషం ఇద్దామని అనుకుంటున్నాడనీ నేను సుశీలతో చెప్పాను. సుశీల పెద్దగా సంతోషించనూలేదు. తనకు వేషం అక్కర్లేనట్లు నటించనూ లేదు. సినిమాలలో నటించి పైకి రావటానికి కావలసింది అదృష్ట మన్నది. ఎవరు తన్ను పైకి తీసుకొస్తారో చెప్పలేమన్నది. తనకన్న తెలివిగల వాళ్ళే అదృష్టం లేక పైకి రావటంలేదన్నది. ఇవన్నీ కడుపు

లోనుంచి వచ్చిన మాటలో కాదో తెలీదు గాని ఆ పిల్లకు మాట్లాడే వైనం తెలుసు ననటానికి సందేహంలేదు.

మేము యింట్లో ఒక అరగంటసేపు కూచున్నాం. మాకు సుశీల ఏ లోపమూ చెయ్యలేదు. తల్లిని కాఫీ చెయ్యమని పురమాయించింది. అన్నను పక్క అంగడికివెళ్ళి మంచి కిళ్ళీలు కట్టించుకురమ్మని పంపింది. ఆ యిద్దరూ మిగిలినవాళ్ళ దగ్గర యమకింకరుల్లా ప్రవర్తించినా సుశీల దగ్గర చాలా వినయ విధేయతలతో మసులుకోవటం కనిపించింది.

మేం సుశీల దగ్గిరనుంచి వచ్చేసేటప్పుడు, "ఏమంటావు" అన్నాడు కామరాజు.

"పనికొచ్చే పిల్లలాగే వుంది" అన్నాను.

"పనికిరావటమేమిటి ? నే నివాళ చెబుతున్నాను జ్ఞాపకంపెట్టుకో—సుశీల కొద్దిరోజుల్లో గొప్ప స్టారవుతుంది" అన్నాడు కామరాజు.

"నన్నడిగితే ఆ అమ్మాయి పైకి రాదు. ఎండు కట్టెలాగా భగ్గున మండి ఆరిపోతుంది. ఈ పిల్లకున్న అందమూ, శక్తీకూడా లేనివాళ్ళు ఈమెను దాటి పైకిపోతారు" అన్నాను. ఇది అక్షరాలా జరగబోతుందని ఆ క్షణంలో నేను కూడా వూహించలేదు.

"అదేం ?" అన్నాడు కామరాజు, ఆశ్చర్యంగా.

"ఆ సుశీల వెంటవున్న గ్రహాలను చూశావా ?"

"అదా నీ అనుమానం ? వాళ్ళమొహం. వాళ్ళదేమీ లేదు. పెత్తనం సుశీలదే ! ఆ పిల్ల దగ్గర వాళ్ళు కుక్కిన పేల నుకో !" అన్నాడు కామరాజు.

"అదే వచ్చిన చిక్కు. వాళ్ళమీద ఆ పిల్ల అధికారం సాగినన్నాళ్ళూ వాళ్ళనుంచి ఆ పిల్ల బయటపడదు. వాళ్ళ ప్రభావం ఆ పిల్లమీద వుండనే వుంటుంది. అది ఆ పిల్లని కాలక్రమాన కుంగదీసి తీరుతుంది" అన్నాను.

నా మాట కామరాజుకు నచ్చకపోవటంలో ఆశ్చర్యం లేదు. కాని నా మాటమీద వాడికి గురికూడా లేకపోయింది. అందువల్ల కూడా అట్టే నష్టం వుండకపోను... వాడు అనుకున్న ప్రకారం పిక్చరుతీసి ఆమెను అందులో వుపయోగించుకుంటే.

కాని దురదృష్టవశాత్తూ కామరాజు పిక్చరు తీయలేకపోయాడు. ఆ రోజుల్లో ఏ నలభై వేలతోనో పిక్చరు తీసే అవకాశం వుంది. పదివేలు చేతిలో వుంటే మిగతాది డిస్ట్రిబ్యూటర్లు ఇచ్చేవాళ్ళు. కామరాజు దగ్గర పుష్కలంగా డబ్బున్నది కూడాను—వాళ్ళ నాన్న కాటక మప్పుడు బాకీదార్ల దగ్గరనుంచి చచ్చు ధరలకు బోలెడన్ని పొలాలు తీసుకున్నాడు. అయితేనేం ? తన కొడుకు సినిమాలలోకి పోయి చెడిపోతాడని ముసలాడికి విచారం పట్టుకుంది. "నువు సినిమా తీస్తే నేను ఏ రైలు కిందో పడతాను. తరవాత నీ యిష్టం !" అని బెదిరించాడు.

"మా నాన్నకు తెలీయకుండా నీ పేర తీస్తాను. సరేనను !" అని నన్ను ప్రోత్సహించాడు వాడు. నేను సరేనన

లేదు. అంతటితో ఆ ప్రయత్నం పోయింది. తరువాత కొద్ది రోజులకే సుశీల ఇంకేదో పిక్చర్లో నటించి మంచిపేరే తెచ్చుకుంది.

"సరిఅయిన తరుణంలో చాన్సు పోయింది. ఇంకో పిక్చర్లో నటించిందంటే మనం వెళ్ళి పలకరించటానికి కూడా వుండదు. పెద్ద స్టారయిపోతోంది సుశీల," అన్నాడు కామరాజు నన్నొకసారి కలుసుకుని.

"పోతే పోనీ, ఇంకా చాలామంది వున్నారు." అన్నాను.

కాని సినిమా ప్రపంచంలో మే మిద్దరమూ అనుకోని పరిణామాలు చాలా జరిగాయి. మొదటి సంగతి—పిక్చర్ల ఖరీదు పెరిగింది. యుద్ధం వచ్చింది. మా కామరాజు అన్నట్టుగా సుశీల పెద్దస్టార్ కాలేదు. ఆమె నటించిన మూడో పిక్చరులో ఆమె ప్రేక్షకులకు ఆశాభంగం కలిగించింది. నాలుగో పిక్చరులో చచ్చువేషం దొరికింది. తరువాత ఆమెకు బుకింగులు లేకుండానే పోయాయి.

ఒకసారి కామరాజు మా వూరు వచ్చాడు. ఏదో మాటల సందర్భాన "సుశీలను గురించి నువ్వన్నమాట అక్షరాలా నిజం. నాకు సుశీల అంతా చెప్పింది" అన్నాడు.

"నే నేం చెప్పాను?" అన్నాను. నా కేమీ అర్థం కాలేదు.

సుశీల పైకి రాలేక పోవడానికి కారణం ఆమె తల్లి, అన్నయ్యేనని కామరాజు నాకు రూఢిగా చెప్పాడు.

"వాళ్ళ ప్రభావానికి లొంగేదైతే వాళ్ళకు అంత భిన్నంగా ఎందుకుంటుందని నాకు అనుమానం వేసింది. అందు చేత నీ మాట నమ్మలేదు. తీరా విచారిస్తే సుశీలలో అంత తేడా వుండటానికి కారణం వేరేవుంది. అది వాళ్ళ మేన మామదగ్గిర పెరిగింది. మేనమామ పోయాక తల్లీ, అన్నా గ్రహాలై పట్టారు. ఇంకెవరో సినిమాఛాన్స్ యిప్పించారు. కాని, సుశీల దిగజారిపోయింది. నేను యీమధ్య చూశాను. ఏ చెట్టియారో చేరదీసి డబ్బిస్తున్నాడని నా అనుమానం. ఇప్పుడుచూస్తే సుశీల సినిమాస్టారుగా పనికివస్తుందనికూడా నమ్మలేవు" అన్నాడు కామరాజు.

"మనిషి వికారంగా అయిపోయిందా?" అన్నాను.

"వికారంగా కాలేదు. అందంగానేవుంది. కాని అప్పటి లక్షణాలే లేవు. మనిషినిచూస్తే యిటువంటి మనిషిని సిని మాలలోకి యెట్లా తీసుకున్నా రనిపిస్తుంది. చూస్తేగాని నీ కర్థంకాదు" అన్నాడు కామరాజు.

"ఎట్లాచస్తే మనకేం? పోనిస్తూ!" అన్నాను చిరాకుగా.

"నేను సినిమా తియ్యటం వృత్తదిగాని, సుశీలను మళ్ళీ సినిమాస్టార్‌నుచేసి తీరుతాను. చూస్తూవుండు" అన్నాడు కామరాజు.

నేను నిర్ఘాంతపోయి, "ఏం చెయ్యబోతున్నావ్?" అని అడిగాను.

"సుశీలను పట్నంనుంచి తెచ్చేశాను. బెజవాడలో పెట్టాను" అన్నాడు.

"తీసుకురావడమే?" అన్నాను.

"ఔను. తల్లినీ, అన్ననీ వెంట వుంచటానికి వీలులేదన్నాను కావలిస్తే వాళ్ళకు డబ్బు పంపిస్తాను. సుశీలను మళ్ళీ సినిమాస్టార్ చెయ్యాలి. అవుతుందికూడాను. ఒకసారి నువ్వు వచ్చి చూడు కాస్త మనవంటివాళ్ళమధ్య కొన్నాళ్ళుంటే మనిషి మారిపోతుంది" అన్నాడు కామరాజు.

"ఇదంతా నీ కెందుకొచ్చిన బెడద?" అన్నాను.

కామరాజు నాతో వాదించలేదు. తరువాత కొద్ది రోజులకు నేను బెజవాడ వెళ్ళినప్పుడు సుశీలను చూశాను. మావాడు చెప్పినమాట నిజమే. సుశీల యిప్పుడు పూర్వం కన్నాకూడా అందంగానేవుంది. కాని, మనిషి లోలోపల జారిపోయింది. ఇప్పు డామె మాట్లాడుతుంటే అందరూ మాట్లాడినట్టే వుందిగాని ప్రత్యేకాకర్షణ యేమీ లేదు. మేము బందరుకాలవ ఒడ్డున యింట్లో చూసిననాడు ఆమె మాతో చేసిన ప్రసంగంలో బోలెడంత అభినయం వుందని నా కవాళ అర్థమైంది! ఈ మనిషి మళ్ళీ సినిమాస్టార్ చేస్తే మనవాడు పూరా ప్రయోజకుడే అనుకున్నాను. వాని ఓర్పు తలుచుకుంటే నా కాశ్చర్యం వేసింది. కాని, వాని యత్నం కొనసాగుతుందని నా కేకోశానా ఆశలేదు.

అప్పుడప్పుడూ బెజవాడ వెళ్ళినప్పుడు సుశీలను చూస్తూండేవాణ్ణి ఎన్ని నెలలు గడచినా నా కామెలో చెప్పుకోతగిన మార్పేమీ కనిపించలేదు.

ఒకసారి నేను వెళ్ళేసరికి కామరాజు యింట్లో లేడు. సుశీల నాకు మామూలు మర్యాదలన్నీ చేసింది. రెండు కప్పులు కాఫీ తయారుచేసి తెచ్చి నా కెదురుగా కూచొని,

"అన్నట్టు మీ రొకప్పుడు నేను సినిమాలలో పైకి రానని ఆయనతో అన్నారుట కదూ!" అని అడిగింది.

"నీతో అన్నాడా? ఏమిటి!' అన్నాను.

"ఏదో మాటల సందర్భంలో అన్నారు" అన్నది.

ఈ ప్రశ్న సుశీల ఎందుకు వేసిందో నా కర్థంకాలేదు. ఆ విషయం మళ్ళీ ఎత్తలేదు. నేను అంతకన్నా యెత్తలేను.

మరి కొన్నాళ్ళకు నేను వాళ్ళింటికి వెళ్ళినప్పుడు కామ రాజు "ఒరే, సుశీలను మళ్ళీ యే సినిమాకైనా బుక్ చేయిస్తే బాగుణ్ణని చూస్తున్నాను. ఎవరిద్వారాపని అవుతుందంటావు" అని అడిగాడు.

"ఒకరిద్వారా ఏమిటి? ఆవిణ్ణి యెరిగిన సినిమావాళ్ళే లేరా? ఇద్దరూకలిసి పట్నం వెళ్ళి కొద్దిరోజులు మకాంపెట్టి చూడండి" అన్నాను.

"మీరు కూడా ఆయన పిచ్చిలోనే పడతారేమండీ? మీరేమో మొహమాటం లేని మనిషి అనుకున్నానే?" అన్నది సుశీల.

"నా కెందుకు మొహమాటం?" అన్నాను.

"నేను సినిమాలకు పనికిరానని వున్నమాట చెప్పెయ్య కూడదూ?" అన్నది.

"అది వున్నమాట యేమిటి?" అని అడిగాను.

"నేను పనికొస్తానని మీరు నిజంగా నమ్ముతున్నారా?" అన్నది.

"సినిమాకు పనికిరాని మనుషులంటూ వున్నారా?" అన్నాను.

"అట్లాఅయితే సరేలెండి," అన్నదిసుశీల, ఏదో అర్థం చేసుకున్న దానిలాగా.

నాకు ఒళ్ళు మండిపోయింది "అబ్బో! నువ్వే సినిమాలలో ప్రవేశిస్తే అందరి స్టార్లనూ తలదన్నుతావు." అని నేననాలని ఆమె వుద్దేశమైతే నేను నా గొంతులో వూపిరి వుండగా ఆ మాట అనను. ఇంకో మనిషిని వుబ్బేసేటందుకు తగిన ఓపిక నాకు లేదు. అది మాం వాని సొత్తు.

"అదేమిటి, సుశీలా? నువు ఒకప్పుడు సినిమాలకు పనికివచ్చినదానివేగా!" అన్నాడు కామరాజు.

"మధ్యలో పనికిరాకుండా పోలా?" అన్నదామె.

"మళ్ళీ మారావేమో! చూస్తేతప్పేం!" అన్నాడు నాడు.

"నే నేమీ మారలేదు. నే నెప్పుడూ సినిమాలకు పనికి రాలేదు. నన్నిలా బతకనివ్వండి." అన్నది సుశీల.

ఈ మాటలూ, ఆమె గొంతూ వింటుంటే నా కాశ్చర్యం వేసింది. నేను పొరపాటు పడ్డాను, ఆమెకు సినిమాలలో నటించాలని లేదు.

సుశీలతో ఒంటరిగా మాట్లాడే అవకాశం దొరకగానే అడిగేశాను.

"ఒకప్పుడు మా అమ్మా, అన్నయ్యా నన్ను సినిమాలకు పనికొస్తానని గ్యాసుకొట్టారు. నమ్మాను. మళ్ళీ యిప్పుడీయనా అదే సాగించాడు. నేను చచ్చిపోతున్నాను. మీరైనా చెబుదురూ— నేను పనికిరానని!" అన్నదామె. 'నే నేమీ మారలేదు" ఆమె యెందుకన్నదో నా కర్థమైంది.

"కాని, మా కామరాజు మనసుకూడా కాస్త గమనించు. వాడు యెంతో ఓర్పుతో నిన్ను సినిమా స్టారును చెయ్యాలని పూనుకొన్నాడు. నువు సినిమాలే ఒద్దంటే వాడు చిన్నబుచ్చుకుంటాడు" అన్నాను.

"ఒకవేళ మేం పట్నం వెళతామనుకోండి. వసన్నవ్వరూ తీసుకోకపోతే అప్పుడైనా ఆయన చిన్నబుచ్చుకోక తప్పదుగా!" అన్నది.

"అప్పుడు నీ తప్పుండదు. నీ ధర్మం నువు చేసినదానివవుతావు" అన్నాను.

"ఎట్లాగైనా నేనొక సినిమాఛాన్స్ సంపాస్తే నా ఋణం తీరిపోతుందంటావా యేమిటి?" అన్నది సుశీల.

"ఒక విధంగా అంతే!" అన్నాను.

తరువాత కామరాజూ, సుశీల పట్నం వెళ్ళారు. వెళ్ళిన నెలలోపుగా ఆమెకు వేషం దొరికింది. ఈ సంగతి తెలుపుతూ నాకు కామరాజు వుత్తరం రాశాడు. కథ సుఖాంతమయిందిగదా అనుకున్నాను.

కాని కొద్దిరోజులకే కామరాజు వచ్చేశాడు. సుశీలను వాడు వొదిలి పెట్టేశానన్నాడు. ఆశ్చర్యంగా కారణ మేమిటన్నాను. ఆమె నటించే పిక్చరుతాలూకు డైరెక్టరుతో ఆమె సంబంధం పెట్టుకున్నదని వాడు చెప్పాడు.

"ఆ మనిషి నా సంపర్కంతో మారిందని భ్రమపడ్డాను. ఏమీ మారలేదు" అన్నాడు వాడు.

తరువాత నాకు సుశీల వుత్తరంరాస్తూ, "మీ మగ వాళ్లు నిజంగా పరమ నీచులు. ఐనా, కామరాజుగారి ఋణం తీర్చుకున్నానని తృప్తిగా వుంది" అని రాసింది.

---

# 'ఫాలౌట్'

బస్తీనుండివచ్చిన బావమరిదిని వెంట పెట్టుకొని రామన్న వంగతోటకు వెళ్ళాడు. బావమరిది వనమయ్యేవదో పత్రికకు రిపోర్టరుగా పనిచేస్తున్నాడు.

("ఏరా, పోర్టరు పెద్దగేడా. రిపోర్టరు పెద్దగేడా? అని రామన్న వనమయ్య ఛలోక్తి విసిరినప్పుడు వాళ్ళ పల్లెటూరివాళ్ళు మందహాసం చేసేవాళ్ళు.)

వనమయ్య శెలవుమీద వున్నాడు. అతను కావటానికి చిన్నరిపోర్టరే అయినా పెద్ద ఆలోచనలు గలవాడు. అతనికి ఒకటేచింత! అమెరికాలో పుట్టకపోతినే అని.

ఇదే అమెరికను రిపోర్టరయితే శలవులు పూరికేపోని స్తాడా? బోలెడంత "పిండి" పోగుచేసి ఒక పుస్తకంరాసి యిరవై వేల డాలర్లకు అమ్మేసేవని!

అసలు అమెరికను రిపోర్టరు శలవులు బావగారి వంగతోట చూడబోతాడా? షేమ్!